క్లుప్తంగా

భరతమాతకు ప్రత్యేక పూజలు



వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భరతమాతను పూజిస్తున్న భక్తులు

అచ్యుతాపురం: మండలంలోని హరిపాలెం-అందలాపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం భరతమాత పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాతృ భూమి రుణం తీర్చుకోవాలని సూచించారు. అందరూ దేశభక్తిని కలిగి ఉండాలని కోరారు. సబ్ డివిజన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు, మహిళా కన్వీనర్ భీశెట్టి దేవి, వెంకటరావు, ఆది సూరి సన్యాసిరావు, శ్రీలక్ష్మి, వరలక్ష్మి, కాండ్రేగుల రమణ, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సోమునాయుడు కుటుంబం సందడి



ఒకే చోట కలుసుకున్న సోమునాయుడు కుటుంబ సభ్యులు

మునగపాక: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఇతర ప్రాంతాల్లో వ్యాపార, ఉద్యోగ రీత్యా స్థిరపడిన వారంతా స్వగ్రామాల్లో ప్రస్తుతం సందడి చేస్తున్నారు. మునగపాకకు చెందిన ఆడారి సోమునాయుడు కుటుంబ సభ్యులంతా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకచోట చేరి ఉల్లాసంగా గడిపారు. పిల్లలు, పెద్దలంతా సుమారుగా 32 మందికి పైగా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపి మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఎన్ని పనులున్నా అంతా ఒకచోట చేరి గ్రామీణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించడం ఎంతైనా అవసరమని సోమునాయుడు కుటుంబ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

25న గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవం

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. స్థానిక రింగ్‌రోడ్డు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవం జరుగుతుందన్నారు. 37 స్టేజ్ ప్రోగ్రాంలు, వివిధ రకాలైన నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కోల్‌కతా లైటింగ్, భారీ బాణసంచా, ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, కోశాధికారి కొణతాల నూకమహాలక్ష్మీనాయుడు, సహాయ కార్యదర్శి పి.వి.రమణ, సభ్యులు పీలా నాగశ్రీను, కొణతాల మాధవ, దాడి బుజ్జి, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, భీశెట్టి ప్రసన్న, పెంటకోట లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



వెంకటాపురంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకుడు సత్యనారాయణ, తదితరులు

మునగపాక: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సీఐటీయూ నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం వెంకటాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీకి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రేబాక బాబూరావు, బలిరెడ్డి సింహాచలం, రాంబాబు, సూరిబాబు, రమణమ్మ, నారాయణరావు, వెంకటేష్, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతిలోగా అధ్వానంగా ఉన్న పల్లె రహదారులకు మరమ్మతులు చేపట్టి మెరుపులు తీసుకొస్తామంటూ కూటమి నేతలు ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. పలు చోట్ల శంకుస్థాపనలు చేసి చేతులు దులుపేసుకున్నారు తప్ప పనులు చేపట్టిన దాఖలాలు లేవు. ఫలితంగా దూర ప్రాంతాల నుంచి సంక్రాంతికి వచ్చే అతిథులకు అవస్థలు తప్పలేదు.



గతుకులమయంగా ఉన్న అడ్డు రోడ్డు రామచంద్రపురం-నర్సీపట్నం రోడ్డు



చిన ఉప్పలం రోడ్డు దుస్థితి

రహదారులకు సంక్రాంతులు ఎక్కడ?

ప్రకటనలకే పరిమితమైన కూటమి నేతలు
పల్లె రోడ్లకు కలగని మోక్షం
సంక్రాంతికి వచ్చిన అతిథులకు తప్పని పాట్లు

ఎస్.రాయవరం: మండలంలో పలుగ్రామాలను కలుపుకొంటూ ఉన్న ప్రధాన రహదారులు సంక్రాంతి ముందు కనీస మరమ్మతులకు నోచుకోలేదు. నిత్యం ప్రయాణించే వారి సంగతి పక్కన పెడితే పట్టణ ప్రాంతాల నుంచి పల్లెలకు వచ్చిన వారంతా గతుకులమయమైన రోడ్లతో నానా అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుతం రోడ్డులు వేయలేదని, సంక్రాంతి ముందు ప్రధాన రోడ్లకు మరమ్మతులు పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికారు. అయితే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రోడ్లు వేస్తున్నామని చెప్పడం తప్ప పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు.

■ నిత్యం వేల సంఖ్యలో ప్రయాణాలు సాగించే అడ్డు రోడ్డు-రామచంద్రపురం నర్సీపట్నం రోడ్డు అధ్వానంగా మారింది. సుమారు 15 కిలోమీటర్లు మేర ఉన్న గతుకుల రోడ్డుకు హోంమంత్రి వంగలపూడి అనిత గతేడాది నవంబర్ 28న రూ.2,432 లక్షల కేటాయిస్తూ పనులు చేపడుతున్నట్టు శంకుస్థాపన కూడా చేశారు. అయితే ఇంత వరకు పనులు ప్రారంభించ లేదు.

■ పేటసూదిపురం రోడ్డు సుమారు 2 కిలోమీటర్ల మేర గోతులమయం కావడంతో రాకపోకలకు జనం నానా అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి రూ.75 లక్షలతో పనులు చేస్తున్నట్టు స్థానిక కూటమి నాయకులు శంకుస్థాపన చేసి హడావుడి చేశారు. ఇక్కడ పనులు కూడా ముందుకు కదలలేదు.

■ వమ్మవరం పెనుగొల్లు రోడ్డును రూ.75 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్టు కొబ్బరికాయ కొట్టారు. పనులు మాత్రం ఇప్పటికీ ప్రారంభించలేదు.

■ రేవుపోలవరం-చిన ఉప్పలం రోడ్డును రూ.20 లక్షలతో మరమ్మతులు చేస్తున్నట్టు అధికారులు చెప్పారు. ఇక్కడ కూడా తట్టమట్టి వేయలేదని స్థానికులు విమర్శలు చేస్తున్నారు.

■ గుడివాడ పెదఉప్పలం రోడ్డు కిలో మీటరు మేర గతుకులతో నిత్యం ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ఈ రోడ్డుకు నిధులు కూడా విడుదల చేయలేదు. జేవీ పాలెం, ఎస్.రాయవరం ఆర్ అండ్ బీ రోడ్డు 9 కిలోమీటర్ల మేర శిథిలావస్థకు చేరుకుని మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది. ఇలా అధ్వానంగా ఉన్న రహదారులకు ఎప్పటికి మోక్షం కలుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



దార్లపూడిలో రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన హోంమంత్రి అనిత,(ఫైల్)

దారుణ దారులే గతి!

కోటవురట్ల: అధ్వాన రహదారులకు మోక్షం కలగలేదు. మండలంలోని ఏ పల్లెకు వెళ్లినా దారుణ దారులే భయపెడుతున్నాయి. వాహనదారులు గోతులతో పడరాని పాట్లు పడుతున్నారు. ప్రధానంగా అన్నవరం, రాజుపేట, చౌడువాడ పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. పెద్ద గోతులు పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న అన్నవరం రహదారి

ప్రమాదకరంగా రాకపోకలు



అడ్డురోడ్డు నుంచి దార్లపూడి మీదుగా కోటవురట్ల మండలం రామచంద్రపురం వరకు రోడ్డు భారీ గుంతలతో దర్శనమిస్తోంది. హోంమంత్రి శంకుస్థాపన చేసినా ఇప్పటికీ పనులు చేపట్టలేదు. నిత్యం వేలాది మంది వాహనచోదకులు ప్రమాదకర పరిస్థితిలో రాకపోకలు సాగిస్తున్నారు. అడ్డురోడ్డు నుంచి నర్సీపట్నం, కోటవురట్ల వెళ్లే వారితో పాటు, చినగుమ్ములూరు సమీపంలో ఉన్న నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు ఇదే రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తారు. తక్షణం ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– కొంకోట నీలేంద్రరావు, మాజీ జెడ్పీటీసీ, దార్లపూడి, ఎస్.రాయవరం మండలం

అవస్థలు తప్పడం లేదు..



మా గ్రామానికి ప్రధాన రహదారులు రెండు ఉన్నాయి. పెదఉప్పలం శివారు చినఉప్పలం గ్రామం ఆర్అండ్‌బీ రోడ్డు గోతులమయమై అధ్వానంగా తయారైంది. మరమ్మతుల కోసం రూ.20 లక్షలు కేటాయించారని చెప్పారు. అయినా పనులు చేపట్టలేదు. గుడివాడ నుంచి పెదఉప్పలం వెళ్లే రోడ్డు మరమ్మతులకు తక్షణం నిధులు కేటాయించాలి. నిత్యం రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.

– కోశెట్టి వెంకటరమణ, పెదఉప్పలం సర్పంచ్, ఎస్.రాయవరం మండలం

వారంలో పనులు ప్రారంభం



దార్లపూడి, చినఉప్పలం రోడ్ల మరమ్మతు పనులు వారం రోజుల్లో ప్రారంభిస్తాం. నాలుగైదు రోడ్ల పనులు ఒకే కాంట్రాక్టరు చేపట్టడం వల్ల సంక్రాంతి ముందు పూర్తి చేయలేకపోయాం.

– జ్ఞానేశ్వరరావు, ఆర్ అండ్ బీ జేఈ, నక్కపల్లి

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



చినదొడ్డిగల్లులో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రమణ

నక్కపల్లి: పదో తరగతి విద్యార్థులపై విద్యా శాఖ ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. విద్యార్థి మేలుకో కార్యక్రమంలో భాగంగా 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేసింది. సెలవు దినాల్లో కూడా ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పదో తరగతి పరీక్షలకు సంబంధించిన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఏడిద వెంకటరమణ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. రాత్రి సమయాల్లో విద్యార్థులు ఏవిధంగా చదవాలి అనే దానిపై సూచనలు చేశారు. తల్లిదండ్రులతో మాట్లాడుతూ విద్యార్థులకు రాత్రిపూట మంచి పోషకాహారం అందజేయాలన్నారు. టీవీలకు, ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. తెల్లవారు జామున నిద్రలేపి చదివించాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారన్నారు. పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు



నాటికలో ఓ సన్నివేశం

మునగపాక: మండలంలోని గణపర్తి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన నాటిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కనుమ పండగ సందర్భంగా స్థానిక నవతరం సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. నాన్నకు ప్రేమతో, జై జవాన్..జై కిసాన్ నాటికలతో పాటు భరతనాట్యం వంటి ప్రదర్శనలు అలరించాయి. ఆహుతులను ఆకట్టుకునేలా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.

అపరాల సాగుపై దృష్టి సారించాలి



పొలంలో క్షేత్ర సందర్శన చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

పాయకరావుపేట: మండలంలోని మాసాహేబుపేట, పెంటకోట గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర సందర్శనతో పాటు రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి మాగాణుల్లో అపరాల సాగుపై దృష్టి సారించాలన్నారు. రైతులు ప్రభుత్వం ఇచ్చే కనీస మద్దతు ధరకు తమ ఉత్పత్తులను విక్రయించుకోవాలన్నారు.

ఎకరానికి 2 బ్యాగ్స్ ఎస్ఎస్‌పీ వేసుకోవడం వల్ల పంట దిగుబడి బాగా వస్తుందని, అపరాలు పంట వేసిన 30-35 రోజుల వ్యవధిలో కలుపు నివారణ హిమజిత్‌ఫైర్ లీటరు నీటికి 2.5 మి.లీ. కలిపి స్ప్రే చేస్తే కలుపుని తగ్గించవచ్చునని చెప్పారు. పంట వేసిన 30-40 రోజుల తరువాత 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ వేసుకోవాలన్నారు. పంట పూత దశలో కేజీ 19-19-19, కేజీ 130 -45, ఈ 2 కేజీలు 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే 30 నుంచి 40 శాతం వరకు దిగుబడులు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్ వీహెచ్ఏ, సతీష్, ఎంపీవో, గ్రామ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

19న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర

- భారీ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు
- భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



కాంతులీనుతున్న వినాయకుని సెట్టింగ్

యలమంచిలి రూరల్: ఉమ్మడి విశాఖ జిల్లాలో పేరొందిన యలమంచిలి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర ఈ నెల 19న నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా మార్గశిర మాసోత్సవాల అనంతరం సంక్రాంతి తర్వాత అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతరను తిలకించడానికి సుమారు 50వేల నుంచి లక్ష మంది తరలివస్తుంటారు. రద్దీకి తగినట్టుగా ఉత్సవ కమిటీతో పాటు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర ఏర్పాట్లలో భాగంగా ఇప్పటికే యలమంచిలి పట్టణంలోని ప్రధాన రహదారి, అమ్మవారి ఆలయం, ఆలయానికి వెళ్లే అంతర్గత రహదారులన్నీ భారీ విద్యుత్ దీపాలతో అలంకరించడంతో ఆయా ప్రాంతాలు కాంతులీనుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన రాధాకృష్ణులు, కనకదుర్గమ్మ, వినాయకుని సహా వివిధ దేవతా మూర్తుల సెట్టింగులు ఆకట్టుకుంటున్నాయి. జాతర కోసం స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో జెయింట్ వీల్, రంగులరాట్నం, భారీ ఎత్తున స్టేజ్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేయడానికి ఉత్సవ కమిటీ నిర్ణయించింది. దీనికి అనుగుణంగా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ కొఠారు సాంబ తెలిపారు.

పండగెళ్లిపోయినా జీతభత్యాల్లేవు...



గోవాడ సుగర్‌ఫ్యాక్టరీలో రెండో రోజు ఆందోళన చేస్తున్న ఫ్యాక్టరీ గుర్తింపు సంఘం నాయకులు, కార్మికులు

చోడవరం : జీత భత్యాలు పాత బకాయిలు చెల్లించాలని కోరుతూ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నేటికీ పరిష్కరించలేదంటూ ఫ్యాక్టరీ ఆవరణంలో గురువారం కార్మికులంతా విధులను నిలిపివేసి గేటు బయట ఆందోళన చేశారు. సంక్రాంతిలోగా కార్మికులకు రావలసిన పాత బకాయిలు చెల్లిస్తామని చెప్పి ఇప్పటి వరకూ ఎందుకు చెల్లించలేదని గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు భాస్కరరావు ప్రశ్నించారు. కార్మికులకు ఇవ్వాల్సిన ఓటీల డబ్బులు ఇవ్వలేదని, గతేడాది నుంచి డీఓలు ఇవ్వలేదని, ఇవన్నీ వెంటనే చెల్లించాలని కోరారు. సంక్రాంతి పండగ అయిపోయినా నేటికీ జీతభత్యాలు చెల్లించకపోవడం దారుణమని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం: మండలంలోని వెదురువాడ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఆపరేషన్ డివిజన్ ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను నరికివేస్తామన్నారు. వెదురువాడ, జి.ధర్మవరం, దిబ్బపాలెం, మోసయ్యపేట, అచ్యుతాపురం, ఎం.ధర్మవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులకు సహకరించాలని ఆయన కోరారు.

కోడి పందేలు, పేకాట శిబిరాలపై దాడులు

నక్కపల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని నాలుగు రోజులుగా వివిధ గ్రామాల్లో జరిగిన కోడి పందేలు, పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 కేసులు నమోదు చేశామని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. కోడి పందేలు, పేకాట శిబిరాల్లో పట్టుబడిన 35 మందిపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేశామన్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు. 17 కోడి పుంజులు, రూ.25 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

అచ్యుతాపురం: మండలంలోని కోడి పందేలు, లాటరీ బల్లాటలపై పోలీసులు గురువారం దాడులు చేశారు. ఉప్పవరం గ్రామంలో కోడిపందేలు ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని, రెండు కోళ్లు, రూ.830 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఖాజీపాలెంలో బల్లాట నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.శంకరరావు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బకాయిపడ్డ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల జీతాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీ యాజమాన్యం, కూటమి ప్రభుత్వం, కలెక్టర్ చొరవ తీసుకుని కార్మికులకు నాలుగు నెలలుగా బకాయిపడిన రూ.6కోట్లను విడుదల చేయాలన్నారు. కర్మాగారంలో పర్మినెంట్, ఎస్ఎంఆర్, కాంట్రాక్ట్, ఓచర్ పేమెంట్ కార్మికులు సుమారు 352 మందికి జీతాలు లేక సంక్రాంతికి అల్లాడిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల బకాయిలు చెల్లించని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కర్మాగారం వద్ద ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కె.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్లు దాటిన దంపతులకు సత్కారం



60 ఏళ్లు దాటిన దంపతులను సత్కరిస్తున్న గీతా ప్రచార సమితి కన్వీనర్ పరదేశినాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటు పడాలని శ్రీవెంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు కోరారు. మండలంలోని గొల్లలపాలెంలో కనుమ పండుగ సందర్భంగా బుధవారం రాత్రి 60 సంవత్సరాలు దాటిన 20 మంది దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ప్రతి ఒక్కరూ ప్రేమించాలన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులపై చిన్నచూపు లేకుండా వారికి అండగా నిలవాలన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా నేత శీరా రమణమ్మ, గీతా ప్రచార సమితి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: యువత సన్మార్గంలో నడవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ సూచించారు. మునగపాక దళితవాడలో బుధవారం రాత్రి నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు తమలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తన గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, దళిత నాయకులు డొక్కా నాగభూషణం, కోనపల్లి రామ్మోహనరావు, బీలా లక్ష్మణరావు, కరణం గణేష్, అనిల్‌కుమార్, ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలి

నర్సీపట్నం: సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్లు ప్రముఖ భూమికి పోషించాలని డీఎం ఎం.ఎస్.ఎస్.ధీరజ్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక గ్యారేజ్‌లో డ్రైవర్లకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ భూభాగంలో ఇద్దరు వ్యక్తులు ముఖ్యమన్నారు. ఒకరు తన ప్రాణాలను పణంగా పెట్టి దేశానికి రక్షణ కల్పించే సైనికుడు కాగా, రెండో వ్యక్తి ప్రయాణికుల భద్రతకు భరోసా ఇచ్చే డ్రైవర్ అన్నారు. ఆర్టీసీలో ప్రయాణిస్తే భద్రత ఉంటుందని ప్రయాణికుల నమ్మకం అన్నారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా డ్రైవర్లు ప్రమాదాలకు తావులేకుండా సేవలు అందించాలన్నారు. జీరో యాక్సిడెంట్ నమోదుకు డ్రైవర్లు కృషి చేయాలన్నారు. అనంతరం టౌన్ ఎస్సై ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్ ఏకాగ్రత కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

ఘనంగా నంది తీర్థం



నక్కపల్లిలో నంది తీర్థంలో భక్తుల సందడి

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలో గురువారం నంది తీర్థం ఘనంగా జరిగింది. నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న నందీశ్వరుడి ఆలయం వద్ద ప్రతి ఏటా ముక్కనుమ రోజున తిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీ. చుట్టు పక్కల గ్రామాల నుంచి తోడపెద్దులను తీసుకువచ్చి సంబరాలు, చెట్టు భజనలు చేశారు. నక్కపల్లి, ఉపమాక, సారిపల్లిపాలెం, మనబానవానిపాలెం, కోనవానిపాలెం, అయ్యన్నపాలెం కాగిత, వెదుళ్లపాలెం, న్యాయంపూడి, జానకయ్యపేట, సిహెచ్ఎల్ పురం, చందనాడ, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట తదితర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు హాజరై నందీశ్వరుడ్ని దర్శించుకున్నారు. ఒడ్డిమెట్ట గ్రామంలో లక్ష్మీగణపతి ఆలయం వద్ద పరస జరిగింది. దేవవరం, నామవరం, గుంటపల్లి, సీతారామపురం, పీఎల్ పురం, పాయకరావుపేట తదితర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు పరసలో సందడి చేశారు. తోడ పెద్దుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.